క్లుప్తంగా

మండల సమావేశం రేపు

ఎటపాక: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తెలిపారు. మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు కాక కామేశ్వరి ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందని ప్రజాప్రతినిధులు రావాలని ఎంపీడీవో కోరారు. మండలంలోని జరుగుతున్న అభివృద్ధి పనులపై పూర్తి సమాచారంతో అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం


చిన్నారావు (ఫైల్)

జి.మాడుగుల: మండలంలో వంజరి పంచాయతీ పిన కిల్తారి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో(టిడబ్ల్యూ) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పండ్లి చిన్నారావు గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో విశాఖపట్నం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. చిన్నారావుకు భార్య గంగాభవాని, ముగ్గురు పిల్లలున్నారు. ఉపాధ్యాయుడు చిన్నారావు మృతదేహాన్ని మండలంలో గెమ్మెలి పంచాయతీలో తన స్వగ్రామం వరిగెలపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు. చిన్నారావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో ఏరులై పారుతున్న మద్యం


మాట్లాడుతున్న సర్పంచ్ రామారావు, మండల పీసా కమిటీ ఉపాధ్యక్షుడు జయరాజు

వి.ఆర్.పురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి గ్రామాల్లో పల్లెల్లో మద్యం ఏరులై పారుతుందని చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కోటం జయరాజు ఆదివారం చెప్పారు. ఈ సందర్భంగా వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో రేఖపల్లి, వి.ఆర్.పురంలలో రెండు మద్యం షాపులున్నాయన్నారు. మద్యం సిండికేట్‌దారులు విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్టు షాపులకు అనిమతులు ఇచ్చారని ఆరోపించారు. గ్రామల్లో మంచినీళ్లు సరిగ్గా దొరకడం లేదుగాని మద్యం మాత్రం ఏరులై పారుతోందన్నారు. బెల్టు షాపులపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. తక్షణమే బెల్టు షాపులపై తగు చర్యలు తీసుకోవాలని ఈ విషయాన్ని కలెక్టర్, చింతూరు ఐటీడీఏ పీవోల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

మల్లంపాలెంలో శ్రమదానం


ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

కె.కోటపాడు : మల్లంపాలెంలోని పెద పైడిమాంబ, శ్మశానవాటికలో ఆదివారం గ్రామస్తులు శ్రమదానం చేశారు. వార్డు మెంబర్ వంటాకు గోవిందరావు, మహిళలు, యువకులు ఆయా పరిసరాల్లో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు తొలగించారు. చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయ ప్రారంభోత్సవం


మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో మోదకొండమ్మ ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. గ్రామస్తులంతా కలిసి గ్రామ శివారులో లక్షలాది రూపాయలతో మోదకొండమ్మ ఆలయంను నిర్మించారు. ఆదివారం వేదమంత్రాలు నడుమ శాస్త్రోక్తంగా పురోహితుల సమక్షంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ప్రత్యేక కుంకుమ పూజలు, వ్రతాలు, హోమాలు చేశారు. కుముదాంపేట, విజయరామరాజుపేట, మంగళాపురం, అప్పలరాజుపురం, సురవరం, తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేవారు. కోలాటం పోటీల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు. రాత్రికి పలు భజన బృంద సభ్యులు భక్తి గీతాలు పాడి అలరించారు. సర్పంచ్ కంటే వెంకట్ పద్మరేఖ, పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దుమ్ము ఎగసి.. ధూళి కమ్మేసి





రహదారి పక్కన కుప్పలుగా పోసి ఉన్న బూడిద, జిప్సం, ఇసుక

ఎటపాక: ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రధాన రహదారి పక్కనే ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నా అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తుండడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణాలోని వ్యాపారులు సరిహద్దున ఉన్న ఎటపాక ప్రాంతాన్ని వారి అడ్డాగా చేసుకుని వ్యాపారాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఎటపాక మండల కేంద్రంలో ప్రధాన రహదారికి పక్కనే బూడిద ఇటుక తయారీ కేంద్రాలు సుమారు 10 వరకు ఏర్పాటు చేశారు. సరిహద్దు తెలంగాణ రాష్ట్రం భద్రాచలం పట్టణంలో నిర్మాణాలకు ఇటుకల డిమాండ్ ఉండడంతో నిబంధనలు భేఖాతర్ చేస్తూ తయారీదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది అనధికారంగా విద్యుత్ వినియోగిస్తూ ఈ కేంద్రాలను నడుపుతున్నట్టు పలువురు చెబుతున్నారు.

వాహనచోదకులకు తప్పని పాట్లు

రహదారి పక్కనే ఉన్న ఇటుకల తయారీ కేంద్రాల వలన ప్రయాణికులు, పర్ణశాల వెల్లే యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటుకల తయారీకి ఐటీసీ నుండి వస్తున్న వ్యర్థాలను నల్లబూడిద, తెల్లబూడిదతో పాటు జిప్సం,ఇసుక మిశ్రమాలను ఉపయోగిస్తున్నారు. అయితే వీటిని రహదారి ప్రక్కనే కుప్పలు కుప్పలుగా పోయడంతో చిన్నపాటి గాలికి బూడిద, జిప్సం ఎగిసి పడుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బూడిద కళ్లలో పడుతుండడంతో ఆ ప్రాంతంలో వాహనాలు నడిపేందుకు భయపడుతున్నారు. ఇటుకల తయారీకి వాడే బూడిద, జిప్సం వలన వాయుకాలుష్యం కావడంతో శ్వాసకోశ సంబంధ వ్యాధుల వస్తాయని చుట్టుపక్కల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని అధికారులు

మండల కేంద్రంలో ఇటుక తయారీ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవట్లేదనే ఆరోపణలు వస్తున్నాయి. తెలంగాణకు చెందిన వ్యాపారులకు ప్రధాన రహదారి పక్కనే వీటికి అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. ముడుపుల మత్తులో ఉన్న పంచాయతీ అధికారులు ఇటువంటి వాటిని చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇటుకల తయారీ కేంద్రాలను ప్రధాన రహదారులకు దూరంగా తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా చేస్తున్న వృద్ధులు

చింతపల్లి: ప్రతిరోజు యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తాజంగి వైద్యాధికారి డాక్టర్ ఉదయ సందీప్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం వృద్ధులకు యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా ట్రైనీ ఆమనిరాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో 72 మంది వృద్ధులు పాల్గొన్నారు. ఎంఈవో ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతపల్లి ఎంపీడీవో బదిలీ


ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి: చింతపల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు అచ్యుతాపురం బదిలీ అయింది.మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్నటువంటి శ్రీనివాసరావుకు ఏడాదిన్నర క్రితం ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం ఈయనకు అచ్యుతాపురం బదిలీ కాగా మాకవరపాలెం మండలం నుంచి చింతపల్లి నూతన ఎంపీడీవోగా సీతా మహాలక్ష్మిని నియమించారు.

థింసా కళాకారులకు ప్రశంస


రవిశంకర్‌తో థింసా కళాకారులు

కొయ్యూరు: థింసా నృత్య కళాకారులను ఆధ్యాత్మిక గురువు పండిట్ రవిశంకర్ ప్రశంసించినట్టు నర్సీపట్నం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఉపాధ్యాయులు గిరిబాబు, విశాఖపట్నం యోగా టీచర్ అరుణకుమారి ఆదివారం తెలిపారు. ఇటీవల బెంగుళూరులోని అంతర్జాతీయ యోగా కేంద్రంలో రవిశంకర్ ఎదుట చింతపల్లి మండలం బౌడకు చెందిన గ్రామస్తులు థింసా నృత్యం ప్రదర్శించే అవకాశం కలిగిందన్నారు. తెలుగు మహోత్సవాల్లో భాగంగా థింసా నృత్య ప్రదర్శన జరిగినట్టు తెలిపారు. ఈ సందర్భంగా థింసా నృత్యం ప్రదర్శించిన కళాకారులను రవిశంకర్ ప్రదర్శించినట్టు చెప్పారు. వారి వెంట కొయ్యూరు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యుడు పాటి గణేశ్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొయ్యూరు: మర్రివాడకు చెందిన పాత్తూరు గెడ్డయ్య ఆదివారం దొడ్డవరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కొయ్యూరు నుంచి మర్రివాడకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా దొడ్డవరం గ్రామంలోని కల్వర్టు వద్ద వాహనం అదుపు తప్పింది. దీంతో పక్కనే ఉన్న గోతిలో పడిపోయాడు. దీంతో అతని తలకు గాయమైంది. స్థానికులు హుటాహుటిన అతడిని రాజేంద్రపాలెం ఆస్పత్రికి తరలించారు. ఆయనకు వైద్యులు చికిత్స అందించారు.

వైభవంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు


రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

ఎటపాక: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధ్వజస్తంభ, విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. మూడవ రోజు సీతారామచంద్రస్వామి ఆలయంలో జీవ శిలా ధ్వజస్తంభం, బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి, మహాలక్ష్మి, గట్టుముసలమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. నాల్గవరోజు ఆదివారం గ్రామదేవత అమ్మవారికి బోనాల సమర్పణకు ఆడపడుచులు అశేషంగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు పలువురు ప్రముఖులు, సరిహద్దు భద్రాచలం పట్టణం నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహక కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

యాంత్రీకరణ సాగు లాభదాయకం


రైతులతో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

రావికమతం: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ కోరారు. యాంత్రీకరణతో వ్యవసాయం చేపట్టడం ద్వారా పని వేగం కావడంతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలో చినపాచిలి గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలను శాస్త్రవేత్తల ద్వారా రైతుల కందించే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి రూప మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలో వివరించారు. బీపీటీ-2295, బీపీటీ-2846, ఎంటీయూ-1224, ఎంటీయూ-1262, ఎంటీయూ-1318 తదితర నూతన రకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి రూప, శాస్త్రవేత్తలు ఎస్.సత్తిబాబు, కిషోరు కుమార్, కిరణ్‌కుమార్, వెంకటేష్, పి.పద్మావతి, పి.బాబు, సర్పంచ్ కె.రామలక్ష్మి, వైస్ సర్పంచ్ శంకరరావు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట


పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మండలంలోని నాగవరంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు, శ్రీను, వెంకట్ తదితరులు అభయాంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

గంజాయి అనర్థాలపై అవగాహన


గ్రామస్తులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ దుర్గాప్రసాద్

మోతుగూడెం: మండలంలోని డొంకరాయి పోలీసు స్టేషన్ పరిధిలోని నర్సింగ్‌పూర్ గ్రామంలో చింతూరు సీఐ తెల్లం దుర్గా ప్రసాద్ ఆదివారం సందర్శించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను తమకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశనమవుతాయన్నారు. గిరిజనులు ఎవరు మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులు కావొద్దని, వారికి ఏ విధంగా సహకరించొద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక


బూరుగుపాలెంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: పూర్వ విద్యార్థుల కలయిక ఎంతో ఉత్సాహంగా సాగింది. మండలంలోని బూరుగుపాలెం ఉన్నత పాఠశాలలో 2004-05 ఏడాదిలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం తమ పాఠశాలలో సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 20 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఒకరికి ఒకరు యోగక్షేమాలతోపాటు ప్రస్తుతం ఏయే రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో సుమారు 80 మందికిపైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకుని ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో సందడి చేశారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తీర్మానించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. పూర్వ విద్యార్థులు దొండా నరేష్, రమేష్, దూది రాజేష్, చప్పా వెంకటేష్, కిషోర్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.


వడ్డాదిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నాతవరం: మండల కేంద్రం నాతవరం హైస్కూల్‌లో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అప్పట్లో చదువు చెప్పిన గురువు సాయికి రాష్ట్ర ఉత్తమ అవార్డు రావడంతో ఘనంగా సత్కరించారు. హైస్కూల్‌కు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు సమావేశంలో తీర్మానించుకున్నారు. అనంతరం హైస్కూల్‌లో సరస్వతిదేవి విగ్రహం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం సత్యనారాయణ, అప్పన్నబాబు, జగన్నాథరావు, విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మా దారి.. రహదారి


చింతపల్లి జాతీయ రహదారిపై సంచరిస్తున్న పశువులు


రాత్రివేళల్లో రోడ్డుపై అడ్డంగా ఉన్న పశువులు

- హైవేపై విచ్చలవిడిగా పశువుల సంచారం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని పశువుల యజమానులు

చింతపల్లి: మండల కేంద్రంలో గల జాతీయ రహదారిపై విచ్చలవిడిగా పశువులు తిరుగుతుండడంతో వాహనచోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత జాతీయ రహదారి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గూడెం కొత్తవీధి మండలం పెదవలస నుంచి చింతపల్లి మండలం సంబసింగి వరకూ వంతెన పనులు మినహా రోడ్డు పనులు 90 శాతం వరకూ పూర్తయ్యాయి. దీంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు, జీపులు, వ్యాన్లు, బస్సులతో పాటు అన్ని వాహనాలు వేగవంతంగా రోడ్డుపై దూసుకు పోతున్నాయి. ఈ పరిస్థితుల్లో జాతీయ రహదారికి అడ్డంగా విచ్చలవిడిగా రోజంతా పశువులు తిరుగుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. తరచూ ట్రాఫిక్ నిలచిపోతోంది. పశువుల యజమానులు నిర్లక్ష్యంతో వాటిని వదిలేస్తున్నారు. ప్రస్తుతం రైతులు పొలాల్లో ఎటువంటి పంటలు చేపట్టక పోవడంతో పశువులను కాపలాకాసే కార్యక్రమాన్ని పూర్తిగా వదిలేశారు.దీంతో పశువులు విచ్చలవిడిగా రోడ్లు పైనే తిరుగుతుండడంతో వాహనచోదకులకు ఇబ్బందిగా మారాయి.

రాత్రిళ్లు మరింత ప్రమాదం

చింతపల్లి మండల కేంద్రం నుంచి నర్సీపట్నం, సీలేరు, భద్రాచలం, హైదరాబాదు తదితర సర్వీసులతో పాటు పలు వాహనచోదకులు రాత్రి సమయాల్లో రాకపోకలు సాగిస్తూంటారు. అదే సమయంలో రోడ్డుకు అడ్డంగా పశువులు పడుకుని ఉండడంతో వేగంగా వస్తున్న వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి ప్రమాదాల్లో వాహనచోదకులు గాయాలుపాలై మృత్యువాత పడిన సందర్భాలున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతోపాటు మూగ జీవాలు మృతి చెందుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశువులు రోడ్లపై విచ్చల విడిచిపెట్టకుండా పశు యజమానులను హెచ్చరించే చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా సాగు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీహరిరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలకు అనుగుణంగా సాగు చేపట్టాలని శాస్త్రవేత్త శ్రీహరిరావు కోరారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా అరబుపాలెం, చెర్లోపాలెం గ్రామాల్లో ఆదివారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, అనకాపల్లి వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. సాగులో యూరియా వినియోగం తగ్గించాలని ఆయన తెలిపారు. మోతాదుకు మించి ఎరువులను వాడితే ప్రయోజనం ఉండదన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాలన్నారు. పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి మాట్లాడుతూ పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీవన ఎరువులు, పశువుల గెత్తం వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాసరావు, సత్యవతి, వ్యవసాయ సహాయకులు పవన్, ఉద్యానవన శాఖ అధికారి ప్రవీణ, శరగడం యోగి నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల పండగలు


సత్తెమ్మతల్లి పండగ ఊరేగింపులో భక్తులు

మునగపాక: స్థానిక దళితవాడలో ఆదివారం సత్తెమ్మతల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మహిళలు, దళితవాడ వాసులంతా ఊరేగింపుగా డప్పు, వాయిద్యాలతో ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, డొక్కా నాగభూషణం, పిల్లి అప్పారావు, కోనపల్లి రామ్మోహనరావు, దిమ్మల నూకరాజు, బీలా అప్పలనాయుడు, గణేష్, దిమ్మల శివ, బీలా లక్ష్మణరావు, రాజు, శివ గణేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కోటవురట్ల: రామచంద్రపాలెంలో గంగాలమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో పోటెత్తింది. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అన్నసమారాధన నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కన్నబాబు, మాజీ సర్పంచ్ నంబారు రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.